దోషులను కఠినంగా శిక్షించాలి

● వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్

ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 20: బీసీల హక్కులపై మాట్లాడుతున్న తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (టీఎస్ఏ) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఎం శ్రీకాంత్‌యాదవ్‌పై దాడికి పాల్పడిన ఏబీవీపీ నాయకులను కఠినంగా శిక్షించాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతున్నారని గుర్తు చేశారు. కేంద్రప్రభుత్వ ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాలని, బీసీ కులగణన చేయాలని, బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని ఉద్యమిస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో ఏబీవీపీ గుండాలు కక్షగట్టి అతడిపై, అతని మిత్రబృందంపై భౌతికదాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఓయూలో అకాడమిక్ వాతావరణాన్ని పాడుచేస్తూ, డీజేలతో అశ్లీల పాటలకు డ్యాన్సులు వేస్తూ మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి దాడిచేయడం అమానుషమని అన్నారు. దాడికి పాల్పడిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్యూ, ఎస్ఎఫ్ఐ, టీపీసీసీ, గిరిజన శక్తి, తెలంగాణ పొలిటికల్ స్టూడెంట్స్ జేఏసీ, బీసీ విద్యార్థి సంఘం, ఎస్టీఎస్ఏ, ఓయూ రీసర్చ్ స్కాలర్స్ అసోసియేషన్, టీఎస్పీ, బీసీ సంఘం, డీఎంఎస్ఏ తదితర సంఘాల నాయకులు చటారి దశరథ్, పుట్ట లక్ష్మణ్, సుమంత్, రవినాయక్, కోట శ్రీనివాస్, శరత్‌నాయక్, వలిగొండ నరసింహ, స్వామిగౌడ్, తాళ్ల అజయ్‌కుమార్, ఆజాద్, రంజిత్ చే, నోముల శేషు, బారి అశోక్, లింగయ్య, సమీర్, ఉదయ్‌కుమార్, నెల్లి సత్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హామీలు అమలు చేయాలి

మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న యూనివర్సిటీల పార్ట్‌టైం అధ్యాపకులు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 20: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వెలువరించిన మేనిఫెస్టోలో పేర్కొన్న హామీని తప్పనిసరిగా అమలు చేయాలని తెలంగాణ స్టేట్ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ (టీజీ ఏయూపీటీఏ) డిమాండ్ చేసింది. అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతినిధులు రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పార్ట్‌టైం లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. పార్ట్‌టైం లెక్చరర్లకు నెలకు రూ.50,000 వేతనం, 12 నెలల పాటు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారని, సమస్యను కేబినెట్‌లో చర్చిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు డాక్టర్ రవీందర్‌గౌడ్, డాక్టర్ కుమార్, డాక్టర్ శ్రీలక్ష్మిరెడ్డి, డాక్టర్ భిక్షపతి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ లింగస్వామి, డాక్టర్ కొండల్, డాక్టర్ ఎస్.శంకర్, డాక్టర్ ఎర్రం నాగేంద్ర, డాక్టర్ శేఖర్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ ఎండీ ఖాన్, డాక్టర్ గంగాధర్, డాక్టర్ పండరీరెడ్డి, డాక్టర్ ఎం.రాము, డాక్టర్ భీంరావు, డాక్టర్ మహేశ్, డాక్టర్ రమేశ్, డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ ఈవినింగ్ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 20: ఓయూ పరిధిలోని ఎంబీఏ ఈవినింగ్ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్-ఈవినింగ్) కోర్సుల రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫీజును ఈనెల 26లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 20: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల ఇన్‌స్టంట్, మేకప్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. బీఏ, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ, బీఎస్సీ, బీకామ్ కోర్సుల ఆరో సెమిస్టర్ ఇన్‌స్టంట్, మేకప్ పరీక్షలను ఈనెల 27 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బేగంపేట్, సెప్టెంబర్ 20: విద్యుత్ లైన్లలో తలెత్తిన సాంకేతిక లోపాలు, ట్రిమ్మింగ్ కారణంగా లాలాగూడ, ఉస్మానియా యూనివర్సిటీ సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ప్యారడైజ్ ఏడీఈ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. లాలాపేట్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, అలాగే చెన్నారెడ్డి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 నుంచి 1.25 వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆర్టీసీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ఆర్టీసీ ఆసుపత్రి, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ల్యాబ్స్ తార్నాక, టెలిఫోన్ ఎక్స్చేంజ్, హుడా, హెచ్ఎండీఏ వెనక ప్రాంతాల్లో విద్యుత్‌ను నిలిపివేస్తారు.

నవరాత్రి ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం


క్రీడాకారిణి అయేషాను అభినందిస్తున్న సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, సెప్టెంబర్ 20: సికింద్రాబాద్ వాసవి ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతాఫల్‌మండిలో అక్టోబరు 3 నుంచి నిర్వహించే దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావుగౌడ్‌ను ఆహ్వానించారు. సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పద్మారావుగౌడ్‌కు సంఘం నేతలు విశ్వేశ్వర్, విశ్వజ్యోతి శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. ఉత్సవాలకు తన వంతు సహకారాన్ని అందిస్తామని ఎమ్మెల్యే ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మహిళా బాక్సర్‌కు సత్కారం

జాతీయ బాక్సింగ్ టోర్నమెంట్‌లో బంగారు పతాకాన్ని సాధించిన సయ్యద్ అయేషాను ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అభినందించారు. జింఖానా మైదానంలో 53 కేవీఎస్ నేషనల్ స్పోర్ట్స్ మీట్ 2024 జరిగిన పోటీల్లో ఆమె పాల్గొన్నారు. అయేషా, ఆమె కోచ్ మనోజ్‌రెడ్డి శుక్రవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పద్మారావుగౌడ్‌ను కలుసుకున్నారు. ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహిస్తామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

ఆస్తి పన్ను వసూలు చేయాలి

సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్

సికింద్రాబాద్, సెప్టెంబర్ 20: ఆస్తి పన్ను వసూళ్లలో అధికారులు చురుకుగా పాల్గొనాలని జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్ సూచించారు. పన్ను వసూళ్లకు సంబంధించి సికింద్రాబాద్, ఖైరతాబాద్ జోన్‌లోని డీసీలు, ఏఎంసీలతో సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పన్ను వసూలు విషయంలో వ్యవహరించాల్సిన తీరుపై సంబంధిత జోన్లకు సంబంధించిన అధికారులతో రివ్యూ చేపట్టారు. ఇందుకు అనుసరించాల్సిన విధి విధానాలపై వారికి దిశ నిర్దేశం చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు ఖదీర్, మారుతి దివాకర్, రాజు, సుభాష్‌రావు, సమ్మయ్య, రజనీకాంత్‌రెడి, వి.ప్రశాంతి, నాగేశ్వర్, విద్యాధర్, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లలోని ఏఎంసీలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలో ఆస్తి పన్ను వసూలుపై అధికారులతో సమావేశమైన జెడ్సీ రవికిరణ్

ప్రైవేట్ స్కూళ్ల సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వినతిపత్రం అందిస్తున్న స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు

బేగంపేట్, సెప్టెంబర్ 20: ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ గుర్తింపు పొందిన స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. శుక్రవారం అసోసియేషన్ ప్రతినిధులు వెస్ట్ మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. సనత్‌నగర్ కార్పొరేటర్ లక్ష్మి వారివెంట ఉన్నారు. వారు మాట్లాడుతూ తమను కమర్షియల్ టాక్స్ పరిధిలో చేర్చి టాక్స్ చెల్లించాలంటూ నోటీసులతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ స్కూల్స్ విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా స్పోర్ట్స్ ఫీజ్ కింద ఒక్కో విద్యార్థికి రూ.6 చొప్పున హైదరాబాద్ జిల్లా స్కూల్స్ స్పోర్ట్స్ ఫెడరేషన్‌కు సుమారు 2.60లక్షల మంది విద్యార్థులకు రూ15.60 లక్షలు చెల్లిస్తున్నట్లు వివరించారు. కానీ తమ స్కూల్స్‌కు ఇప్పటి వరకు ఫెడరేషన్‌లో సభ్యత్వం కల్పించలేదని ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళితే స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ నుంచి తమకు అనుమతులు రావాలని సమాధానం చెబుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు ఉమామహేశ్వర్‌రావు, నయూద్ అమ్మద్, పవన్ పాథక్, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రెడ్ క్రాస్ సేవలు ప్రశంసనీయం

గవర్నర్‌ను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సలహాదారు డాక్టర్ సింగం శ్రీనివాస్‌రావు

అమీర్‌పేట్, సెప్టెంబర్ 21: తలసీమియా రోగులకు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ద్వారా అందుతున్న సేవలను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రశంసించారు. అత్యాధునిక యంత్ర పరికరాల ద్వారా తలసీమియా రోగులకు రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ద్వారా సత్వర సేవలను అందుబాటులోకి తెస్తూ సంస్థ ప్రతినిధులు విస్తృతం చేస్తున్న సేవల తీరును ప్రత్యేకంగా ప్రశంసించారు. శుక్రవారం ఆయన రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌ను సందర్శించగా, సంస్థ సలహాదారు డాక్టర్ సింగం శ్రీనివాస్‌రావు ఆధునీకరించిన ఇక్కడి యంత్ర పరికరాలను గురించి వివరించారు. అదేవిధంగా తలసీమియా రోగులకు అవసరమైన మందులు, వైద్య పరీక్షలు, వారికి రవాణా సదుపాయాలు, ఆహారాన్ని ఉచితంగా అందజేస్తున్న అంశాలను గవర్నర్‌కు వివరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు అందిస్తున్న సేవలను గవర్నర్ ప్రశంసించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్


బీదల బస్తీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్, సెప్టెంబర్ 20: సీతాఫల్‌మండి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని కార్పొరేటర్ హేమ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని బీదల బస్తీలోని సీసీరోడ్డు నిర్మాణ పనులను అధికారులు, నాయకులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రూ.25లక్షల వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టినట్టు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అనంతరం స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, లలిత, రేవతి, సాయి, ఎస్సీ సీతారాం, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరిలో స్వచ్ఛ సర్వేక్షణ్

బొల్లారం, సెప్టెంబర్ 20: కంటోన్మెంట్ ఏడో వార్డు తిరుమలగిరిలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం కంటోన్మెంట్ బోర్డు శానిటేషన్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో తిరుమలగిరిలోని పలు కాలనీల్లో, బస్తీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ అధికారి అమిత్, సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో పాల్గొన్న సర్కిల్ అధికారి అమిత్, సిబ్బంది

దుండగులను రక్షిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 20: ఓయూలో ముప్పై ఏళ్లుగా విద్యార్థులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే గణేశ్ ఉత్సవాలను జరగకుండా అడ్డుకుని శోభాయాత్రపై ఉద్దేశపూర్వకంగా దాడిచేసిన దుండగులను రక్షించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటని ఏబీవీపీ మండిపడింది. వారికి కాంగ్రెస్ నాయకులు వత్తాసు పలుకుతున్నారని తీవ్రంగా ఖండించింది. మద్యంమత్తులో గణనాథుల విగ్రహాల ధ్వంసానికి కుట్ర చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నాయకులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కుట్రతో ఆర్ట్స్ కళాశాల వద్ద శోభాయాత్ర ఫ్లెక్సీని చింపి, గణనాథుడిని, విద్యార్థులను దుర్భాషలాడుతూ దాడిచేయడం హేయమన్నారు. ప్రభుత్వంలోని ముఖ్యులు దుండగులకు మద్దతుగా నిలుస్తూ, వారి అరాచకాలను అడ్డుకున్న విద్యార్థులపైనే కేసులు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు.

కంటోన్మెంట్ ఎమ్మెల్యేను పరామర్శించిన తలసాని

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 20: కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పరామర్శించారు. శ్రీగణేశ్ సోదరి విజయ బుధవారం సాయంత్రం గుండెపోటుతో మరణించగా, శుక్రవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ శ్రీగణేశ్‌ను ఫోన్‌లో పరామర్శించి తన ప్రగాఢ సంతాపం, సానుభూతిని తెలిపారు.

వినోభానగర్‌లో నేడు ఉచిత వైద్య శిబిరం

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 20: తార్నాక డివిజన్ లాలాపేట లోని వినోభానగర్‌లో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. అప్సా, బ్లూ ఫౌండేషన్, జన హిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో వినోభానగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించనున్న శిబిరాన్ని ప్రజలంతా వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, జనరల్ ఫిజీషియన్, ఫిజియోథెరపీ వైద్యులు అందుబాటులో ఉంటారని వివరించారు. బీపీ, షుగర్, ఇతర పరీక్షలు నిర్వహించి, మందులను కూడా ఉచితంగా అందజేస్తామని చెప్పారు.

విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలి

సదస్సులో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తెలుగు క్యాథలిక్ బిషప్స్ కౌన్సిలింగ్, హైదరాబాద్ అధ్యక్షుడు కార్డినల్ పూల ఆంథోని

మారేడ్‌పల్లి, సెప్టెంబర్ 20: విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని తెలుగు క్యాథలిక్ బిషప్స్ కౌన్సిలింగ్, హైదరాబాద్ అధ్యక్షుడు కార్డినల్ పూల ఆంథోని అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని సెయింట్ ఫ్యాట్రిక్స్ హైస్కూల్ ఆడిటోరియంలో సీబీసీ కమిషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ వీకే స్వామి, జనరల్ సెక్రటరీలు డాక్టర్ బ్రదర్ షాజహాన్ ఆంటోని అధ్యక్షతన విద్యా ప్రమాణాలను మెరుగు పరుచడంపై ఒకరోజు సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్డినల్ పూల ఆంథోని హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో విద్యా వ్యవస్థలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఆ దిశగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయని విద్యా సంస్థలు కూడా మరింత ముందుకు వచ్చి విద్యా ప్రమాణాలను మెరుగు పరుచాలని అన్నారు. విద్యార్థులు విజ్ఞాన పరంగా ఏ విధంగా అభివృద్ధి చెందాలి, కొత్త పద్ధతుల ద్వారా ముందుకు నడిపించే అంశాలపై సలహాలు, సూచనలను చేశారు. విద్యార్థులకు తమ క్యాథలిక్ సంస్థ ద్వారా మేరుగైన విద్యను అందించేందుకు తమ సంస్థ ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం ఫాదర్ బాలశౌరి మాట్లాడుతూ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నో విద్యా సంస్థలు కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ తరాలకు ఉపయోగపడే విధంగా మన విద్యా వ్యవస్థలు ఉండాలని అన్నారు. ఈ సదస్సులో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యావేత్తలు, పరిశోధకులు పాల్గొని పలు సలహాలు సూచనలు చేశారు.

చిన్నారులకు పోషకాహారం ఎంతో అవసరం

బన్సీలాల్‌పేట్, సెప్టెంబర్ 20: పిల్లలు ఆరోగ్యవంతంగా ఎదగడానికి సరైన పోషకాహారం ఎంతో అవసరమని, గర్భిణులు, బాలింతలకు అధిక పోషక విలువ గలిగిన ఆహారం తీసుకోవాలని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) సాంకేతిక అధికారి పాండా అన్నారు. ఇంట్లోనే తక్కువ ధరకు తయారు చేసుకునే పోషకాహారం గురించి, ప్రాముఖ్యత గురించి ఆయన వివరించారు. జాతీయ పోషణ్ మాసోత్సవం సందర్భంగా శుక్రవారం బన్సీలాల్‌పేట్‌లోని చాచానెహ్రూనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఐసీడీఎస్ సికింద్రాబాద్ సెక్టార్ పరిధిలోని 36 అంగన్‌వాడీ కేంద్రాల సంయుక్త ఆధ్వర్యంలో పోషకాహార అవగాహన శిబిరం నిర్వహించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ భరత్, ఐసీడీఎస్ బ్లాక్ కోఆర్డినేటర్ సరిత, సెక్టార్ సూపర్‌వైజర్ హరి ప్రియ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు.

ఐసీడీఎస్ సికింద్రాబాద్ సెక్టార్ పోషణ్ మహా అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి


కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలిస్తున్న మేకల సారంగపాణి

అడ్డగుట్ట, సెప్టెంబర్ 20: దూద్‌బావిలో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అధికారులను కోరారు. శుక్రవారం ఆయన పార్టీశ్రేణులతో కలిసి మెట్టుగూడలోని పలు ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. సికింద్రాబాద్ ఎంపీ నిధులు రూ.27లక్షల వ్యయంతో దూద్‌బావిలో చేపట్టిన కమ్యూనిటీ హాల్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సింగారపు నరేశ్‌మాదిగ, దేవుడు కుమార్, వనమాల శ్రీనివాస్, ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సీనియర్ నాయకులు వెల్లాల రామ్మోహన్ జన్మదిన వేడుకలు శుక్రవారం సనత్‌నగర్‌లో ఘనంగా జరిగాయి. పార్టీలకు అతీతంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు నాయకులతో పాటు, తెలంగాణ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు, కాలనీ సంక్షేమ సంఘాలు, యువజన, మహిళా సంఘాల ప్రతినిధులు తరలివచ్చారు. ఈ సందర్భంగా కేక్ కటింగ్‌లో బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యాంసుందర్‌గౌడ్ నాయకులు పాల్గొన్నారు. – అమీర్‌పేట్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కీసర, సెప్టెంబర్ 20: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన కీసర పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. కీసర పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం ఉదయం కీసర నుంచి శామీర్‌పేట్ వైపు వెళ్తున్న ఆటో డివైడర్‌ను ఢీ కొట్టింది. ఈ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే చికిత్స నిమిత్తం ప్రైవేట్ దవాఖానకు తరలించారు. కీసర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణకుమారికి ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, సెప్టెంబర్ 20: ఓయూ సైకాలజీ విభాగంలో తన్నీరు కృష్ణకుమారి డాక్టరేట్ సాధించారు. డాక్టర్ సెల్వియా ఫెర్నాండెజ్‌రావు పర్యవేక్షణలో 'ఇంపాక్ట్ ఆఫ్ పర్సనాలిటీ అన్ అకాడమిక్ స్ట్రెస్ అండ్ సెల్ఫ్ ఎఫికసీ అమాంగ్ కాలేజ్ స్టూడెంట్స్' అంశంపై పరిశోధన పూర్తి చేసి సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆమెకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన ఆమె ఎమ్మెస్సీ సైకాలజీలో కాకతీయ యూనివర్సిటీ నుంచి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తన పరిశోధనకు సహకరించిన ఓయూ సైకాలజీ విభాగం హెడ్ డాక్టర్ స్వాతి, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ డాక్టర్ అనుపమ, తన సైకాలజీ గురువు, కేయూ సైకాలజీ విభాగం ప్రొఫెసర్ రామచంద్రంకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగ వ్యతిరేక వైఖరిని వీడాలి

బేగంపేట్, సెప్టెంబర్ 20: యూనియన్ బ్యాంకు యాజమాన్యం ఉద్యోగ వ్యతిరేక వైఖరిని విడనాడాలని ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఫెడరేషన్, ఆల్ ఇండియా యూనియన్ ఎంప్లాయిస్ అసోసియేషన్లు డిమాండ్ చేశాయి. రెండు రోజులుగా సికింద్రాబాద్ మహాత్మాగాంధీ రోడ్డులోని యూనియన్ బ్యాంక్ రీజినల్ కార్యాలయం ఎదుట వందలాది మంది ఉద్యోగులు ధర్నా నిర్వహిస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. ఏఐయూబీఈఏ వర్కింగ్ ప్రసిడెంట్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ఎండీ సీఈవో, ఈడీతో సహా బ్యాంకు యాజమాన్యం మెరుగైన పని విధానాన్ని పరస్పర సహకార వాతావరణాన్ని ప్రోత్సహించడానికి బుదులు ఉద్యోగులను బెదిరించడం నిబంధనలు ఉల్లంఘించే చర్యలకు పాల్పడుతుందని విమర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సమద్‌ఖాన్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.